క్లుప్తంగా

తపోవనంలో శివరాత్రి ఉత్సవాలు



ఆశ్రమంలో పూజలు చేస్తున్న పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి, వేదపండితులు

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో మహా శివరాత్రి మహోత్సవాలను పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి సంప్రదాయంగా ప్రారంభించారు. ఈనెల 17 వరకూ జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహా శివరాత్రి మహోత్సవాల వైభవాన్ని వేదపండితులకు, వేద విద్యార్థులకు, భక్తులకు వివరించారు. మహా శివరాత్రి పర్వదినాలలో శివపార్వతులను పూజించడం, దర్శించడం, నామస్మరణ మహాభాగ్యాన్ని కలిగించడం, పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయన్నారు. ప్రత్యేక పూజల్లో వేదపండితులు, వేదవిద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు: సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై స్వామినాయుడు సూచించారు. మంగళవారం పాతకొట్టాం హైస్కూల్లో విద్యార్థులకు సైబర్‌నేరాలు, హెల్మెట్ ధారణ, రోడ్డు నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని ప్రజలను చైతన్య పరచాలన్నారు. ప్రమాదాల నివారణను అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం జోలికి పోకూడదని సూచించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ

తొండంగి: పైడికొండలో నూతనంగా నిర్మించిన గౌరీరామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తుని తపోవనం సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ ఆధ్వర్యంలో వైదిక పూజలు, హోమాలు పలు కార్యక్రమాలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు దేవతా విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

గ్రామ సచివాలయం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: కేఏ మల్లవరం గ్రామ సచివాలయాన్ని ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ యోజన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ సర్వేలో చేర్చాలని సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పట్టభద్రుల ఓట్ల సవరణను పరిశీలించారు. అనంతరం ఇంటి పన్ను వసూలుపై పంచాయతీ కార్యదర్శి పంపన జయలక్ష్మిని సమీక్షించారు. మార్చి లోగా వంద శాతం పన్నుల వసూలు చేయాలని ఆదేశించారు.

క్రైస్తవులు ఐక్యంగా ఉండాలి

జగ్గంపేట: జగ్గంపేటలో క్రైస్తవులు సమైక్యంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేయడం అభినందనీయమని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ చైర్మన్ మేడిద జాన్సన్ అన్నారు. జగ్గంపేటలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ జగ్గంపేట అధ్యక్షుడు కె.జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో జరిగిన యూపీఏ పాస్టర్స్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. రాష్ట్రంలో క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఎప్పటికప్పుడు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం మేడిద జాన్సన్‌ను ఘనంగా సత్కరించారు. ముఖ్య ప్రసంగీకులుగా డాక్టర్ సుధీర్ కుమార్ మహంతి,మెర్సీ మహంతి వాక్య సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ జార్జిబాబు,బిషప్‌మీకా, పలువురు క్రిస్టియన్ ప్రముఖులు, పాస్టర్లు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభంకానున్న ఈ కార్యక్రమంలో ప్రజా పరిషత్ అజెండా, పలు అంశాలపై సమీక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

రుద్రాక్ష శివలింగ ప్రదర్శనకు రెడీ

- రేపు ప్రారంభం
- బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి
- 19 నుంచి ఉచిత రాజయోగ శిక్షణ

తుని రూరల్: త్రిమూర్తి శివ జయంతి, మహా శివరాత్రి పర్వదినాల సందర్భంగా ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శివలింగ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం తుని శాఖ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. గురువారం ఎస్.అన్నవరం శివారు వాణి అపార్టుమెంట్, తుని దివాణం వీధిలోని శివానుభూతిధామ్‌లో రుద్రాక్ష శివలింగాలను వేర్వేరుగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదే విధంగా శంఖవరం మండలం అన్నవరం వెలంపేట కోనేరు వాటర్ ట్యాంకు వద్ద 17 వతేదీ నుంచి 23 వరకూ ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జ్యోతిర్లింగాల దివ్య దర్శనం చేసుకుని భక్తులు ఈశ్వరానుభూతి పొందాలన్నారు. ప్రతి రోజు ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటలు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి తొమ్మిది గంటలు వరకు, శివ రాత్రి రోజు ఉదయం ఆరు నుంచి రాత్రి 12 గంటలు వరకూ జ్యోతిర్లింగాలను దర్శించుకోవచ్చన్నారు.



ఎస్.అన్నవరం శివారు వాణి అపార్టుమెంట్‌లో ఏర్పాటు చేసిన శివలింగం

ఉచిత రాజయోగ శిక్షణ

జీవితంలో భయం, చింత, ఆందోళన, నిరాశ, శారీరక అనారోగ్యం, ఒత్తిడి వంటి సమస్యల నుంచి బయటపడేందుకు రాజయోగం ద్వారా పరిష్కారమవుతాయని బ్రహ్మకుమారి తుని శాఖ ప్రతినిధులు పేర్కొన్నారు. అందుకుగాను ఈనెల 19 నుంచి 25 వరకు ఉచిత రాజయోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రోజూ రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటలు వరక ఈ తరగతులు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలను 93915 03366 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

వ్యక్తిత్వ వికాసంతోనే ఉన్నతస్థాయి



శిక్షణలో మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ హైమా

తుని రూరల్: నైపుణ్యం, ప్రతిభ, వ్యక్తిత్వ వికాసం ఉన్న యువత ఉన్నతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందగలరని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ కె.హైమాప్రసాదు అన్నారు. మంగళవారం ఎస్.అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువజన సర్వీసుల శాఖ, జిల్లా సెట్రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల పెంపుపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సెట్రాజ్ మేనేజరు కె.ఎస్.వి.కాశీ విశ్వేశ్వరరావు, యువజన సర్వీసులశాఖ సూపరింటెండెంట్ సి.వి.సూర్యనారాయణ, అసిస్టెంట్ మేనేజరు వి.శ్రీనివాస చౌదరి, ఫీల్డ్ ఆఫీసర్ కె.గౌతమ్, హెచ్ఎం విశాలి, క్రీడాశ్రీ ప్రశాంత్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువజనుల పాత్ర కీలకం

యువజన సంఘాల ఏర్పాటు, సమాజంలో యువజన సంఘాల పాత్ర కీలకమైందని సెట్రాజ్ మేనేజరు కె.ఎస్.వి.కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన యువజన సంఘాల ఏర్పాటు, యువత పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యువత వ్యక్తిత్వ వికాశం, ఉపాధి కల్పనపై పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసుల శాఖ, కాకినాడ సెట్రజ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సు అధికారులు మాట్లాడారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో సెట్రజ్ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ కే హైమాప్రసాద్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సెట్రాజ్ మేనేజర్ కాశీవిశ్వేశ్వరరవు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, యువజన సర్వీసుల శాఖ సూపరటెండెంట్ సూర్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసచౌదరి, ఫీల్డ్ ఆఫీసర్ గౌతమ్, హెచ్ఎం సత్యన్నారాయణ, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి శ్రీను పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఎ.వి.నగరంలో సైకిల్ ర్యాలీ చేస్తున్న వైద్యులు



ప్రత్తిపాడు ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ప్రత్తిపాడు: ఆయుష్మాన్ భారత్–ఆజాది కా అమృత మహోత్సవంలో భాగంగా మంగళవారం ప్రత్తిపాడులో సైకిల్ ఫర్ హెల్త్ – క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సైకిల్ ర్యాలీని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి ప్రారంభించి, సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీని ఉద్దేశించి రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్ ఆర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ సోకితే భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు, వైద్యుల సూచనలు పాటించి సక్రమంగా మందులు వాడితే బయటపడవచ్చన్నారు. పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఉప సర్పంచ్ మదినే నూకరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జి.వెంకటరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక సచివాలయం–1లోను, రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోను మంగళవారం ఆయుష్మాన్ భారత్, సైకిల్‌తో ఆరోగ్యం అనే కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని పెద్దాపురం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పి.సరిత తెలిపారు. జగ్గంపేట, రాజపూడి గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట గ్రామ ఉపసర్పంచి బండారు రాజా, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి, వీరవరం, గెద్దానాపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో ఆయుష్మాన్ భారత్, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ తోట రవి పాల్గొని పలు అంశాలను వివరించారు. స్థానిక వైద్యులు సాయి హేమాంజలి, వి.అరుణ క్యాన్సర్ వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ బి.సతీష్‌బాబు, సర్పంచ్ అంబటి బొజ్జమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సూపర్‌వైజర్లు, నాయకులు పాల్గొన్నారు.

గోకవరం: ప్రతి రోజు సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని గోకవరం ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావుదొర అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గోకవరంలో సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి విద్యార్థులు సైకిళ్లతో దేవీచౌక్ వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సైక్లింగ్ చేయడం ద్వారా కలిగే లాభాల గురించి సీహెచ్‌ఓ మేరీకృప, ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, హెచ్ఎం చిమ్మరాజుదొర, హెచ్ఈ శైలజ, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: ఎ.వి.నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ మాట్లాడుతూ వ్యాయామం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. తొండంగి, రావికంపాడు, కె.పెరుమాళ్లపురం, పీహెచసీల పరిధిలో కూడా ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు భారతి, శిరీష, హరీష్, రవి, హెల్త్‌సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: కత్తిపూడి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రావికంపాడు పీహెచ్‌సీ వైద్యుడు హరిష్ మాట్లాడుతూ పూర్వం రోజుల్లో సైకిల్‌ను తప్పనిసరిగా వాడేవారన్నారు. సైకిల్ తొక్కడం, పరిగెత్తడం అద్భుతమైనవని, ఈ రెండు భౌతికంగా మానవుని శరీరానికి మేలు చేస్తుందన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి



ఏలేశ్వరంలో జవాన్లకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: గత ఏడాది ఫిబ్రవరి 14న పుల్వామా దాడిలో మృతి చెందిన 40 మంది అమర జవాన్లకు మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఘన నివాళి అర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల పట్టణం భారీ ర్యాలీ నిర్వహించారు. పుల్వామా దాడిలో మృతి చెందిన జవానులు దేశం ప్రాణాలు త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రగడ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వి.రామారావు, అధ్యాపకులు శ్రీనుబాబు, వీరభద్రరావు, ప్రసాద్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

కిర్లంపూడి: పుల్వామా దాడికి నిరసనగా కిర్లంపూడిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక యువత ఆధ్వర్యంలో కిర్లంపూడి పోలీస్ స్టేషన్ నుంచి ఏనుగువీధి సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ఎస్సై టి.రఘునాథరావు పాల్గొన్నారు. పుల్వామాలో భారత్ కోల్పోయిన 40 మంది సైనికుల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఏనుగువీధి సెంటర్‌లో మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై బి.కుమార్, మాజీ సైనికులు, పోలీసులు, స్థానిక యువత పాల్గొన్నారు.

మహిళల ఆందోళన



ప్రత్తిపాడులో జియో టవర్ నిర్మాణ ప్రదేశం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రత్తిపాడు: నివాస గృహాల మధ్య ప్రజల అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి తెలిపారు. ప్రత్తిపాడులో సుమ్మిత్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌డీఐపీఎల్) సెల్ టవర్ నిర్మాణ పనులను తిరిగి మంగళవారం చేపట్టడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గత గురువారం టవర్ ఏర్పాటు పనులను స్థానికుల ఆందోళనతో నిలిపివేశారు. అయితే తిరిగి నిర్మాణ పనులు మొదలు పెట్టడంతో స్థానికులు నిర్మాణ ప్రదేశం వద్ద మళ్లీ ఆందోళన చేశారు. ఓ వైపు ఉన్నత పాఠశాల, పక్కనే ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహం, మంచినీటి ట్యాంకు ఉండగా, పక్కనే వైఎస్సార్ వెల్‌నెస్ (ఆరోగ్య కేంద్రం) నిర్మాణం దాదాపు పూర్తికావస్తోంది. వీటన్నింటి మధ్య ఆరోగ్యానికి చేటు తెచ్చే టవర్‌ను నిర్మించరాదని వారు కోరారు. స్థానికుల ఆందోళనకు జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, ఉప సర్పంచ్ మదినే నూకరాజు, పలువురు పంచాయతీ పాలకవర్గ సభ్యులు స్థానికులు ఆందోళనకు మద్దతు ప్రకటించారు. టవర్ నిర్మాణ పనులకు అడ్డుకున్నారు. ప్రజల ఆరోగ్యానికి చేటు తెచ్చే టవర్ నిర్మాణాన్ని తాము అడ్డుకుంటామని, అంతవరకు ఆందోళన కొనసాగిస్తామని స్థానికులు భీష్మించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని, నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. స్థానికులు పట్టు విడవక పోవడంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

యువకుడికి తీవ్రగాయాలు

ఏలేశ్వరం: చిన్నింపేట వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక సీపీఎఫ్ వద్ద రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీని వెనుక నుంచి బైక్‌పై వెళుతున్న యువకుడిని ఢీకొంది ఈ ప్రమాదంలో గాయపడిన యువకుడిని అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. యువకుడి వివారాలు తెలియాల్సి ఉంది.

ఈ–పంట నమోదును సక్రమంగా నిర్వహించాలి

వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ బొప్పన ప్రసాద్

గోకవరం: రబీలో ఈ–పంట నమోదును సక్రమంగా నిర్వహించాలని గుంటూరు వ్యవసాయ కమిషనర్ కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ బొప్పన ప్రసాద్ అన్నారు. సూదికొండ గ్రామంలో జరుగుతున్న రబీ ఈ పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రామకృష్ణా గార్డెన్స్‌ను ఆయన సందర్శించి రైతు కొరిపల్లి అప్పలస్వామిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఏడీఏ బి.మల్లికార్జునరావు, ఏఓ రాజరాజేశ్వరి, వీఏఏలు పాల్గొన్నారు.



ఈ–పంట నమోదును పర్యవేక్షిస్తున్న వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ బొప్పన ప్రసాద్, జేడీఏ తదితరులు

రైతులకు ప్రయోజనం

తొండంగి: రైతులు వ్యవసాయం సాగులో ఈ–పంట నమోదు ప్రక్రియ ద్వారా పలు ప్రయోజనాలు పొందుతారని జేడీ కృపాదాస్ అన్నారు. బెండపూడిలో వ్యవసాయశాఖ అధికారులతో కలిసి సర్వే నంబర్ 20లో పొలాలను, ఈ–క్రాప్ నమోదును ఆయన మంగళవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ సుంకర బుల్లిబాబు, ఏఓ ఎస్.నరసింహం, టెక్నికల్ ఏఓ పద్మజ, ఏఈవో కొప్పన దైవప్రసాద్, గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నారు.

బాలుడి వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు



సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు డాక్టర్‌కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు

గోకవరం: పుట్టకతోనే మూగ, వినికిడి లోపంతో బాధపడుతున్న గోకవరానికి చెందిన బాలుడు వెలిశెట్టి చక్రపాణి వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైందని గోకవరం వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తెలిపారు. బాలుడి వైద్యానికి స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సహకారంతో రూ.5.35 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైందన్నారు. దీనికి సంబంధించిన పత్రాలను మంగళవారం గుంటూరులోని బాలుడికి వైద్యం చేయడానికి ముందుకు వచ్చిన ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడిని కలిసి అందించడం జరిగిందన్నారు. బాలుడి వైద్యానికి సహకరించిన సీఎంకు, ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా ఆయనతో పాటు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులకు రక్షణ కల్పించాలి

జగ్గంపేట: పరిశ్రమలలో కార్మికులకు రక్షణ కల్పించాలని, కార్మికుల మృతికి కారణమైన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్ అన్నారు. జగ్గంపేటలో మంగళవారం జరిగిన ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సామర్లకోట మండలం జి.రాగంపేట గ్రామంలో అంబటి ఆయిల్స్ కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ఏడుగురు కార్మికులు మృతి చెందడం బాధకరమని అన్నారు. ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించిందని, దీని వల్ల కార్మికులు ప్రమాద బీమా పొందే హక్కును కోల్పోయారని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏసు, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రఘువులు, జిల్లా కోశాధికారి కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎఫ్ కంపెనీ సందర్శించిన రాయల్ థాయ్ కాన్సులేట్ జనరల్



సమావేశంలో థాయ్‌లాండ్ దేశానికి చెందిన థాయ్ కాన్సులేట్– జనరల్ నీతిరూగు ఫోన్ ప్రాసెర్ట్

ఏలేశ్వరం: యర్రవరంలోని సీపీఎఫ్ ఇండియా ప్రైవేట్ కంపెనీని మంగళవారం థాయ్‌లాండ్ దేశానికి చెందిన రాయల్ థాయ్ కాన్సులేట్– జనరల్ నీతిరూగు ఫోన్ ప్రాసెర్ట్ సందర్శించారు. సీపీఎఫ్ ఉన్నత అధికారులు క్వాన్‌చాయ్ చాయ్‌ప్రేమ్, సిరపాంగ్, అరుణ్, సుఫోథ్, ప్లాట్ మేనేజర్ సురసక్ సమావేశమై ఫ్యాక్టరీ పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఏపీ ఆక్వా పరిశ్రమలు అందిస్తున్న సహాయ సహకారాలను తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేసినట్టు సీపీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. సీపీఎఫ్ కంపెనీ మరింత అభివృద్ధి చెంది మరింత విస్తరించాలని వారు ఆశాభావం వ్యక్తం చేసినట్లు

సంక్షిప్తంగా

టిప్పర్లపై కేసు

శంఖవరం: నిబంధనలు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న లారీలపై కేసు నమోదు చేసినట్టు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఆర్టీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రౌతులపూడి నుంచి కాకినాడ పోర్టుకు నల్లరాయి తరలిస్తున్న 11 టిప్పర్ లారీలు నిబంధనలు పాటించకపోవడంతో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. రికార్డులను పరిశీలించారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: గ్రామంలో అనుమతి లేని ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిపై దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా, రూ.10 వేలు జరిమానా విధించిందని జగ్గంపేట ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. జరిమానా కట్టలేకపోతే మూడు రోజులు జైలు శిక్ష విధించినట్టు తెలిపారు.

రైలు నుంచి జారి పడి వృద్ధురాలి మృతి

తుని: అన్నవరం–రావికంపాడు మధ్యలో రైలు నుంచి జారి పడి వృద్ధురాలు మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే.అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మంగళవారం జరిగిన సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, వీరఘట్టం మండలం నడుకూరు గ్రామానికి చెందిన లంక సన్యాసమ్మ(62) రైలు నుంచి జారిపడి మృతి చెందింది. మృతిరాలికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు ఇద్దరు భార్య పిల్లలతో కూలిపనుల నిమిత్తం పాలకొల్లు, నరసాపురంలో ఉంటున్నారు. ఇటీవల సన్యాసమ్మ వీరిని చూడడానికి రెండు రోజుల క్రితం నరసాపురం వెళ్లి తిరిగి కుమారులతో కలిసి నడకూరుకు మచిలీపట్నం నుంచి విశాఖపట్నం వెళుతున్న రైలులో బయలుదేరింది. మార్గ మధ్యలో రైలు నుంచి జారిపడి మృతి చెందింది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని ఎస్సై మారూఫ్ తెలిపారు.

హెల్మెట్ ధరించకుంటే జరిమానా



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రఘునాథరావు

కిర్లంపూడి: ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని, లేకుంటే కఠిన చర్యలతోపాటు జరిమానా తప్పదని కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు హెచ్చరించారు. మంగళవారం సింహాద్రిపురం అడ్డురోడ్డులో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎస్సై రఘునాథరావు తనిఖీ చేశారు. ప్రతిపాడు నుంచి కిర్లంపూడి వైపు వేగంగా వెళుతున్న పలు వాహనాలను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వాహనాలపై ప్రయాణికుల వద్ద లైసెన్స్‌లు, రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్సై కుమార్ ఉన్నారు.

కొండ తిమ్మాపురంలో కౌ హగ్ థెరపీ

ఏలేశ్వరం: కొండ తిమ్మాపురంలోని నాడీపతి గోశాలలో 500 మినీ నేచర్ పుంగనూరు గోవులతో కౌహగ్ థెరపీని నిర్వహించారు. ఈ కౌ హగ్ థెరపీని నాడీపతి వైద్యుడు పి కృష్ణంరాజు మొదటిసారిగా పరిచయం చేశారు. ఈ కౌహగ్ థెరపీకి భారీ ఎత్తున గో ప్రేమికులు తరలివచ్చి గోవులను హగ్ చేసుకున్నారు. సందర్శకులు చిట్టి పొట్టి గోవులను ఆసక్తిగా తిలకిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

తాటాకిల్లు దగ్ధం

శంఖవరం: షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో లక్ష రూపాయాల ఆస్తి నష్టం జరిగిందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. కత్తిపూడి కొండవారిపేటలో వల్లూరి బుదియ్య ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. గృహోపకరణాలతో సహ విలువైన సామగ్రి అగ్నికి ఆహూతయ్యాయి. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబం కన్నీరుమున్నీరయ్యింది. వీఆర్వో శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకుని తక్షణ సహాయ నిమిత్తం బియ్యం అందజేశారు. ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా ఆదుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు.

చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన

జగ్గంపేట: తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జగ్గంపేట నియోజకవర్గ పర్యటన సందర్భంగా పర్యటన ఏర్పాట్లను టీడీపీ నేతలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి,శీలం వెంకటేశ్వరరావు, జ్యోతుల నెహ్రూ పరిశీలించారు.

ప్రత్తిపాడు: ఈనెల 15వ తేదీ నుంచి 17 వరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పర్తిపాడు పుల్లారావు కోరారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాయలంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

విరిగిన రైల్వే గేటు

పిఠాపురం: స్థానిక ఉప్పాడ రైల్వే గేటును లారీ ఢీకొట్టడంతో విరిగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు కొంత సమయం అంతరాయం ఏర్పడింది. రైల్వే అధికారులు హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని గేటుకు మరమ్మతులు చేయడంతో తిరిగి గేటు యథావిధిగా పని చేసింది.

రేపటి నుంచి కల్యాణోత్సవాలు

కొత్తపల్లి: వాకతిప్పలో వేంచేసి ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఆలయ అర్చకులు శర్మ తెలిపారు. గురువారం అభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం గ్రామోత్సవం, రాత్రికి స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు.

ఆదిత్యలో రక్తదాన శిబిరం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల క్యాంపస్‌లక్ష బుధవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. సేకరించిన రక్తాన్ని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంకులకు అందజేస్తామని, తమ కళాశాలల విద్యార్థులు, సిబ్బంది సమిష్ట కృషితో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభంకానుందన్నారు. గత 15 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు.

నాణ్యమైన విద్య అందించాలి

ఏలేశ్వరం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పిఠాపురం డీవైఈఓ ఇ.సుభద్ర అన్నారు. మండలంలోని పెద్దనాపల్లి, లింగంపర్తి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె పరిశీలించారు. రికార్డులు, పథకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్బాయి, ఉపాధ్యాయులు భవ్య, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.